# నా స్మృతి పథంలో ఒక రోజు

- శ్రీమతి మాచిరాజు లక్ష్మి గంగా భవాని.

*గత సంచికలలో ...*

*స్థూల శరీరంతో చేసి, సూక్ష్మ శరీరంమీద పడిన ముద్రలు చివరి మజిలీ వరకు చెరిగిపోవు. మద్రాసులో కంప్యూటర్‌లోకి ఎక్కిన సమాచారం, సింగపూర్ వెళ్ళినా, అమెరికాలో అడుగుపెట్టినా మారదు. అంతర్గతంగా వున్నాయని తెలుసుకున్న ఆకాశదర్శనాలు, కళాదర్శనాలు, అన్నీ ఏ శ్రమచెయ్యకుండానే బొందితో కైలాసం అన్నట్టు, అమృత సమానమైన ఆ దర్శనాల అనుభవంతో అమృతమే అందిందికాని, ఇంత దూరం సముద్రంపైన ప్రయాణమా! అని భయం కలగలేదు. విశాలమైన పొడుగుపాటి రోడ్లు అన్నీ సన్నని దారాల్లాగా, అతి వేగంగా పరుగెత్తే కార్లు చిన్న చిన్న చీమలబారుల్లాగా ఉన్నాయి. అందమైన కట్టడాలతో ఉన్న శాన్‌ఫ్రాన్‌సిస్కో ఎయిర్‌పోర్ట్‌లో 7 గంటలకు విమానం ఆగింది.*

## శ్రీ గురుభ్యోనమః

## అమెరికా ప్రయాణంలో అనుభవాలు

చివరిగా ఇంకొక అతను థాంక్స్ చెప్పి బైటకి దారి చూపించాడు. అక్కడైతే ఎవరూ లేరు. తలుపులు మూసి ఉన్నాయి. ఎలా వెళ్ళాలో తెలియదు. మళ్ళీ అతనివైపు తిరిగి ఎలా? అని అడిగితే, వెళ్ళండి, అన్నట్టు చెయ్యి ఊపాడు. చేసేదిలేక ముందుకి అడుగువేసాం, దగ్గరౌతుండగా తలుపులు వాటంతట అవే తెరుచుకున్నాయి. కొంతదూరం వెళ్ళాకా అలాంటివే తలుపులు తెరుచుకున్నాయి. మాకోసం గుమ్మం దగ్గర నిరీక్షిస్తున్న పిల్లలు ఎదురయ్యారు. ఇదంతా జరగడానికి రెండు గంటలు సమయం పట్టింది. 9 గంటలకి బైటకి వచ్చాము. ఇంతటితో అమెరికా ప్రయాణ సమాచారము పూర్తయినట్టే. ఇంక అమెరికాలో పుట్టినవాళ్ళు, స్వర్గం నుంచి మిగిలిపోయిన పుణ్యఫలాన్ని అనుభవించడానికి వచ్చారని దేవీ భాగవతములో చదివినది యథార్థమే అనిపించింది. భోగభూములు ఇవి అన్నందుకు సకల సౌకర్యాలతో, సిరిసంపదలతో, నిర్మలమైన ప్రదేశాలతో, కన్నులపండుగ చేసే రకరకాల వృక్ష సంపదలతో, సహజమైనవా? కాదా? అనిపించే రంగురంగుల పువ్వులతో చూడముచ్చటగా ఉన్నాయి. చెత్తకాని, కాలుష్యం కాని ఎక్కడా కనిపించలేదు. అమెరికాలో పుట్టి పెరిగినవాళ్ళు, అలవాటు అయిపోయినవాళ్ళు ఇండియా రాలేరు, వుండలేరు, అన్నమాటలో అబద్ధం ఏ మాత్రమూ లేదు. భోగం అనుభవించడమే కాదు, భక్తి కూడా ఉండాలన్నట్టుగా ముమ్మూర్తులా భారతదేశ సాంప్రదాయం ప్రకారం నిర్మాణం చేసిన దేవాలయం పవిత్రమైన భావనలతో, హోమం చేసిన నేతి వాసనలతో, భారతదేశంలోనే ఉన్నట్టుగా ఉంది. ఆ పవిత్రదేవాలయంలో శివకుటుంబము, విష్ణుకుటుంబము కొలువై ఉండి, సేవలందుకుంటున్నారు. నిలువెత్తు వెంకటేశ్వరస్వామి, సకల ఆభరణ అలంకారాలతో ఆకర్షిస్తూ లీలావైభవాన్ని వెదజల్లుతున్నాడు. ఓం శాంతి శాంతి శాంతి: *